## క్లుప్తంగా

### దరఖాస్తుల గడువు తేదీ పెంచాలి

**మరిపెడ/కేసముద్రం:** బీసీ, చేతివృత్తుల వారికి రూ. లక్ష అందించే సహాయం దరఖాస్తుల గడువు పెంచాలని తెలంగాణ రాష్ట్ర గీతప నివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తుల వారికి రూ.లక్ష సహాయం అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన పథకం ఈనెల 6న జీఓ విడుదల చేసిందన్నారు. గడువు ఇదే నెల 20వ వరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. అయితే ఇందుకు కావల్సిన సర్టిఫికెట్లు ఆలస్యం అవుతుండడం, మీసేవలో సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం మరో నెల గడువు పెంచాలని ఆయన కోరారు. గీత కార్మికులకు కూడా రూ.లక్ష సహాయం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



**తొర్రూరు:** విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఇట్టె సోమిరెడ్డి కోరారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శరత్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు సంజీవరెడ్డి, వీరభద్రం, ఎండి యాకూబ్, కమలాకర్, స్వామి, రాజలింగం పాల్గొన్నారు.

### వివాహాలకు రాయితీతో ఆర్టీసీ అద్దె బస్సులు



**కేసముద్రం:** కేసముద్రంవిలేజ్‌లో ఆర్టీసీ అందిస్తున్న సౌకర్యాలపై ఆదివారం ఆర్టీసీ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్ ఆఫీసర్ ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. వివాహాది శుభ కార్యాలకు అద్దె బస్సులను, దివ్యాంగులకు 50శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. ఈమేరకు కేసముద్రం నుంచి తొర్రూరుకు, కేసముద్రం నుంచి గూడూరుకు బస్సులు నడపాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్నమాల ప్రభాకర్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న, ఎంపీటీసీ కొమ్ము స్వాతి, రాహుల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



**కురవి:** మండలంలోని కొత్తూరు(జీ) గ్రామంలో త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల అనుగ్రహంతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక మహబూబాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంలో భాగంగా అనుబంధ గ్రంథాల ప్రచారాన్ని నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనుమూడు ఆత్మల వివరాలను తెలుసుకోవడం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మలు స్థాపనం జరుగుతుందని ప్రచారంలో బోధించారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి, సభ్యులు రజిత, నయన్‌దొర, చిన్మయి దొర, సారమ్మ, సారయ్య, స్వప్న, పాపక్క, విజయలలిత పాల్గొన్నారు.

### పల్లెప్రకృతి వనంలో చెట్ల నరికివేత



**గార్ల:** మండలం లోని చిన్నబంజర పంచాయతీలో గల పల్లెప్రకృతి వనంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 15 చెట్లను నరికినట్లు పంచాయతీ కార్యదర్శి బానోత్ మంగీలాల్ తెలిపారు. చెట్లు నరికివేసిన వారిని పోలీసులు గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. చెట్లు మళ్లీ ఇగురు పెట్టకుండా మొదళ్లపై రసాయనాలు చల్లినట్లు తెలిపారు. ఇట్టి విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# తాగునీరందించిన ఘనత కేసీఆర్‌దే

- ఊరూరా మంచినీళ్ల పండుగ

**గార్ల:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గార్లలో తెలంగాణ మంచినీళ్ల పండుగ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈర్యాలీని తొలుత సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం గార్ల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, ఉపసర్పంచ్ మహేశ్వరరావు, ఏఈలు గోపాల్‌రెడ్డి, వసుంధర, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, బిల్ కలెక్టర్ కిషోర్, సుధాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**డోర్నకల్:** ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని తోడేళ్లగూడెం సర్పంచ్ పగడాల అంజయ్య తెలిపారు. మండలంలోని తొడేళ్లగూడెం గ్రామంలో మంచినీళ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఎలమద్ది సత్యావతి, ఉపసర్పంచ్ ఎలమద్ది పవన్, పంచాయతీ కార్యదర్శి సాయితేజ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఘనంగా మంచినీళ్ల పండుగ**

**చిన్నగూడూరు:** మండలంలోని ఉగ్గంపల్లి మంచ్యాతండాలో మంచినీళ్ల పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ కాకతీయ పథకాలపై తాగునీటి విజయాలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు చెన్నారెడ్డి, ధారాసింగ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రతీ ఇంటిలో మిషన్ భగీరథ నీరు**



గూడూరు: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులు



పెద్దవంగర: మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద పూజలు చేస్తున్న సర్పంచ్



గార్లలో..



డోర్నకల్: తొడేళ్లగూడెంలో..



చిన్నగూడూరు: మంచ్యాతండాలో..

**గూడూరు:** మిషన్ భగీరథ నీటితో ప్రతీ ఇల్లు తాగు నీరు ఇబ్బందిలేకుండా ఉందని ఎంపీడీఓ రోజారాణి, తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ మంచి నీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్, మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ సిబ్బంది, అధికారులు ర్యాలీ నిర్వహించారు.

**ఇంటింటికీ భగీరథ జలాలు**

**పెద్దవంగర:** మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టి ఇంటింటికి శుద్ధజలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మీ రామచంద్రయ్య శర్మ అన్నారు. మండల కేంద్రంలో మంచినీళ్ల పండగా సందర్భంగా భగీరథ నీళ్ల ట్యాంకులను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామంలలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీరాం రాము, ఏఈ యాకుబ్ పాషా, జీపీ కార్యదర్శి వెంకన్న, బోనగిరి లింగమూర్తి, చిలుక భిక్షపతి, వార్డు సభ్యులు రజిత, సమ్మయ్య, జయమ్మ, అనుదీప్, సిద్ధు, మహేష్, ప్రవీణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

**మరిపెడ రూరల్:** మండలంలోని గిరిపురం, వీరారం, ఆనెపురం, ఎల్లంపేట, నీలికుర్తి తదితర గ్రామాల్లో నీళ్ల పండుగ వేడుకలను ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దామెర్ల వీరన్న, ఎంపీటీసీలు, కార్యదర్శులు, జీపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: ఆనెపురంలో..

### జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



కరుణాకర్

**కేసముద్రం:** కేసముద్రం మండలం తావుర్యాతండా జీపీకి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థి భుక్యా కరుణాకర్‌కు ఆదివారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్ ఆల్‌ఇండియా ఫలితాల్లో ఎస్టీ విభాగం కింద 694వ ర్యాంకు సాధించాడు. ఈ మేరకు ఆ గిరిజన విద్యార్థిని స్థానికులు అభినందించారు. కాగా పేదరికంలో ఉన్న తనకు సీటు వచ్చినప్పటికీ, హాస్టల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, తనను దాతలు ఆర్థికంగా సాయం అందించి ఆదుకోవాలని కరుణాకర్ వేడుకున్నారు.

**డోర్నకల్:** డోర్నకల్ మోడల్ కళాశాల విద్యార్థి ఎస్టీ విభాగంలో చాందావత్ అఖిల్ 702వ ర్యాంక్, బానోత్ రాహుల్ 800, దారావత్ రమాదేవి 1309వ ర్యాంక్ సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణభాను, ఉపాధ్యాయులు అభినందించారు.

### మండుతున్న గుడ్డు ధర

**డోర్నకల్:** కోడిగుడ్డు ధర మండుతోంది. ఒక్కో గుడ్డు ధర ఆరు రూపాయలకు చేరుకుంది. తీవ్రమైన ఎండలతో కోళ్ల ఫారాలలో కోళ్లు చనిపోతుండటం, ఎండ తీవ్రతతో మధ్యాహ్నం వేళ దానా ఇవ్వకపోవడంతో గుడ్ల దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో గుడ్డు ధర ఆరు రూపాయలకు చేరుకుంది. చికెన్ ధర రూ.300 దాటగా గుడ్డు ధర కూడా పెరగడంతో మాంసం ప్రియులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి..

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

**చిన్నగూడూరు:** సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే నివాసంలో చిన్నగూడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నుంచి 5కుటుంబాలు, 20మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధిని చూసి ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతూ మద్దతు తెలుపుతున్నారన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రతీ కార్యకర్త కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. పార్టీలకతీతంగా అర్హులకు పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మంగపతిరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వల్లూరి వెంకట్‌రెడ్డి, మూల మురళీధర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, సర్పంచ్ మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు చెన్నారెడ్డి, ధారాసింగ్, చెన్నయ్య, ఉప్పలయ్య, శ్రీను, జెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

### మంచినీళ్ల పండుగకు తరలిన అధికారులు

**కురవి:** మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెంలో జరుగు మంచినీళ్ల పండుగకు ప్రత్యేక బస్సుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. బస్సులను జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతీ, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ యాకాంబ్రం, ఈసీలు తరలివెళ్లారు.

### చర్యలు తీసుకోవాలి

**మహబూబాబాద్ రూరల్:** జర్నలిస్టుల హక్కులను కాలరాసిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం జస్టిస్ పి.మాధవిదేవి తనకు ఇచ్చిన ఇంటీరియమ్ ఆర్డర్‌ను ధిక్కరించినందు వల్ల జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి సంబంధిత అధికారులపై హైకోర్టు ధిక్కారం కేసు నమోదైందన్నారు. వారిపై కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడంతో సదరు అధికారులను శిక్షించాలని హైకోర్టులో కేసు వేశానని తెలిపారు. అందుకు హైకోర్టు కూడా షోకాజు నోటీసులు జారీ చేసిందన్నారు. సదరు అధికారులు వచ్చే నెల 7వ తేదీన హైకోర్టు ధర్మాసనం ముందు హాజరుకావాలని ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు.

### గుంతల పూడ్చివేత

**ఖానాపురం :** నర్సంపేట-కొత్తగూడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఖానాపురం మండలంలోని పాకాల అటవీ ప్రాంతం మధ్యలో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు అనేక సందర్భాల్లో కిందపడిపోయారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఖానాపురం ఎస్సై పిట్టల తిరుపతి అశోక్‌నగర్ గ్రామస్తుల సహకారంతో గుంతలను పూడ్చివేయించారు. అటువైపుగా వెళ్లే వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేసముద్రం: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**కేసముద్రం:** ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌కి చెందిన 1987–88 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దార్ల రామ్మూర్తి, గంజి శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, సతీష్, ప్రభాకర్‌రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.

**మహబూబాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని శ్రీవివేకానంద విద్యాలయంలో ఆదివారం 2000-01 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 23 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో వినేయ్, మహేందర్, శ్రీకాంత్, శ్రీను, మహేష్, బాబు, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులను మోసం చేసిన ప్రభుత్వం

**కేసముద్రం:** ఎన్నికల ముందు ఇచ్చిన హమీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను మోసగించిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ చందు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఏం చేశారని, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నారని వారు విమర్శించారు. కాని గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, నేటికి హామీని నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.అయూబ్‌ఖాన్, ఎంపీటీసీ దారావత్ బాలునాయక్, సట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

## నేటి పాదయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మాగం లోకేష్

**గార్ల:** పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నేడు మద్దివంచ నుంచి గార్ల పాకాల ఏటి వరకు చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాగం లోకేష్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడారు. పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం గురించి ఎంపీ, ఎమ్మెల్యే ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో మాత్రం ఓట్లు అడిగేందుకు వచ్చి తమను గెలిపిస్తే కచ్చితంగా బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చి వెళ్తారని, గెలిచిన అనంతరం బ్రిడ్జి నిర్మాణం గురించి ఏమాత్రం పట్టించుకోరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాదయాత్రకు తండాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వెంకటేష్, శంకర్, రాంబాబు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**తొర్రూరు రూరల్:** రోడ్డు ప్రమాదంలో ఓ ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలైనా సంఘటన మండలంలోని గుర్తూరు గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తూరు గ్రామానికి చెందిన విస్సంపెల్లి రోహిత్, ఈదునూరి శ్రీకాంత్ అనే ఇద్దరు యువకులు బైక్‌పై అన్నారం వైపు నుంచి స్వగ్రామం గుర్తూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పడంతో రోడ్డు క్రింద పడడంతో రోహిత్‌కు కాలు విరగగా, శ్రీకాంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

## తపాలా శాఖలో ఆధార్‌సేవలు

- జిల్లాలో నాలుగు కార్యాలయాలలో ఏర్పాటు
- నమోదు కేంద్రాలకు అనూహ్య స్పందన
- నామమాత్రపు ఫీజులతో సేవలు

**మహబూబాబాద్:** తపాలా శాఖ కొత్త కొత్త స్కింలతో ముందుకు పోతుంది. దాంతోపాటు డిజిటల్ లావా దేవీలు, నగద్ డిపాజిట్, నగదు బదిలీలు, ఇతరత్రా కార్యక్రమాలతో తపాల సేవలను విస్తృతం చేస్తోంది. వాటితో ఆధార్‌సేవలతో ప్రజలకు మరింత చేరువైంది. ఆధార్ నమోదు కేంద్రాలకు అనూహ్య స్పందన వస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు ప్రధాన తపాలా కార్యాలయాలు ఉండగా మానుకోటలో ఒకటి ఉంది. మానుకోట ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలో 15 ఉప తపాలా కార్యాలయాలు ఉన్నాయి. కాగా జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంతోపాటు మరిపెడ, కురవి, డోర్నకల్ పోస్టాఫీస్‌లలో ఆధార్ సేవలు ప్రారంభించారు. మానుకోట తపాలా కార్యాలయంలో ఈఏడాది మే 16నుంచి ప్రారంభమయ్యాయి. కార్యాలయంలోనే ఆధార్ నమోదు కేంద్రం పేరుతో ఒక కౌంటర్ ఏర్పాటు చేశారు. కార్యాలయంలో అన్ని సౌకర్యాలు ఉండటంతో ప్రజలు ఇక్కడే ఆధార్ సేవలు పొందుటకు ఇష్టపడుతున్నారు.

**ప్రతి కేంద్రంలో ఆధార్ ఆపరేటర్ ..**

కేంద్ర ప్రభుత్వమే ఏజెన్సీ ద్వారా ఆధార్ ఆపరేటర్‌ల నియామకం చేసింది. మానుకోట తపాల కార్యాలయంలో ఏర్పాటు కేంద్రంలో నెల రోజుల లోపే 181 ఆధార్ అప్‌డేట్ చేసింది. నమోదు చేసిన తర్వాత తపాలా శాఖ ద్వారా ఇంటికి కార్డులు వస్తాయి. నామ మాత్రపుఫీజులతో అప్‌డేట్ చేస్తున్నారు. పేర్లు తప్పులు, అడ్రస్ , పుట్టిన తేదీ, ఇతరత్రా ఏమీ ఉన్నా అప్‌డేట్ చేస్తున్నారు. వాటితోపాటు కొత్తగా ఆధార్ కూడా నమోదు చేస్తున్నారు.




ఆధార్ అప్‌డేట్ చేసిన పత్రాలను అందజేస్తున్న తపాలా శాఖ సిబ్బంది

### అనూహ్య స్పందన



జిల్లాలో నాలుగు తపాలా కార్యాలయాలలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశాం. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా తాగునీరు, కుర్చీలు ఇతరత్రా ఏర్పాటు చేశాం. ఆ కేంద్రాలకు అనూహ్య స్పందన వస్తుంది. ప్రజలు తపాలా సేవల వైపు మొగ్గుచూపుతున్నారు.

– ఎల్.సైదానాయక్, మానుకోట సబ్ డివిజన్ ఏఎస్పీ

## సంక్షిప్త సమాచారం

### పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడిగా నర్సయ్య



**కేసముద్రం:** మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడిగా సామల నర్సయ్య ఎన్నికైనట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నిక సమావేశంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, సాగర్, ఊరుగొండ శ్రీరాములు, రుద్ర సురేందర్, పాశికంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### గుమస్తా సంఘం కమిటీ ఎన్నిక



**కేసముద్రం:** కేసముద్రం వ్యవసాయ మార్కెట్ గుమస్తా సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ముత్యాల శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో సంఘం అధ్యక్షుడిగా చిట్ల సంపత్, ప్రధాన కార్యదర్శిగా కొండా సురేష్, ఉపాధ్యక్షుడు గోవర్దన్, సహాయకార్యదర్శి ఎన్నమాల మహేందర్, కోశాధికారి బండా ప్రభాకర్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

### స్వర్ణకార సంఘం మండల కమిటీ ఎన్నిక



**మహబూబాబాద్ రూరల్:** మహబూబాబాద్ మండల స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు మోత్కూరి శంకర్, కార్యదర్శి ఏర్రోజు కృపాకరాచారి ముఖ్య అతిథులుగా హాజరై సంఘం ఎన్నికలు జరిపారు. అధ్యక్షుడిగా పమ్మి సనాతనాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వంగాల పూర్ణాచారి, కోశాధికారిగా పెండోట హరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వంగాల సోమనర్సయ్య చారి, సిరికొండ హరి, శ్రీపాద శ్రీను, అడానియా ఉపేందర్ పాల్గొన్నారు.

### మహాసభలను జయప్రదం చేయాలి

**బయ్యారం:** జూలై 4, 5 తేదీల్లో ఇల్లందులో నిర్వహించనున్న పీవైఎల్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మండల కార్యదర్శి సురేస్ పిలుపునిచ్చారు. మండలంలోని వెంకట్రాంపురంలో శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అనేక ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణలో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, వీరన్న, నారాయణ, అన్వేష్, రాజు, మహేష్, హరిచంద్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**నర్సంపేట :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బ్రహ్మకుమారీ కల్పన అన్నారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం యోగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి నిత్యం యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం యోగా మాస్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సదానందం బాపూజి, సరిత, వంశీకృష్ణ, వాణి, కిశోర్, వీరస్వామి, చక్రపాణి, రామనాథం, వీరలింగం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



**డోర్నకల్:** మండలంలోని తెల్లబండతండా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. పాఠశాల ఆవరణలో ప్రహరీ ప్రక్కన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి దానికి మినీ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. ప్రహరీ బయట మరో స్తంభాన్ని ఏర్పాటు చేసి దానికి మరో మినీ ట్రాన్స్‌ఫార్మన్‌ను అమర్చారు. వీటికి సంబంధించిన స్టే వైర్లను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసి వాటికి చిన్నపాటి సిమెంట్ రింగులు ఏర్పాటు చేశారు. స్టే వైర్లతో పాటు విద్యుత్ స్తంభానికి ఎలాంటి రక్షణ కల్పించకపోవడంతో ప్రమాదకరంగా మారింది. పాఠశాల విద్యార్థులు ఆడుకునే సమయంలో, మూత్ర విసర్జనకు వెళ్లిన సమయంలో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ స్తంభాలను మరో చోట ఏర్పాటు చేసి ప్రహరీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.